నేను చనిపోవుచున్నాను. నేను చనిపోవుచున్నాను. ఏకాకిగా నేను ఈ లంకమీద చనిపోవుచున్నాను. నేను మిమ్మల్ని తిని మనదలపను. నేను మిమ్మల్ని తిని మనదలపను. అని ఆగుంపు గుంపును సముద్రములోనికి చొఱవిడిచినాడు. తాను సన్యసించిన సమాధిని శరీరం చాలించినట్లు ము క్తి చూఱకొన్నాడు. దేవతలు ఆ జాలారివీరునిమీద పూలవాన కురియించేరు.

ఎందుకు కురియించేరు అంటే ఏమిచెప్పను ! దేవతలు ఆ జాలారివీరునిమీద పూలవాన గురియించేరు.

మర్నాడు మహాసముద్రం ఆ పువ్వుల్ని ఒడ్డుకు తీసుకొచ్చి చూపించక, నురుపే చూపించి ఊరుకుందీ అంటే అది మహాసముద్రంయొక్క లోపంగాని దేవతలయొక్క లోపం గాదు. దేవతలు ఆ జాలారివీరునిమీద తెల్లని పూలవాన గురియించేరు.

“ తోడిమానవు డన్నంత, లోకం నిర్మింపవలసిన కరుణా సోపానాలకు పునాదిరాయి నాఁడు ఆ జాలారివీరుఁడు ఆ మహా సముద్రంలో దింపినాఁడు ! ” అని కామోసు దేవతలు ఆ జాలారివీరునిమీద బహూపరిమళించే విరులు అవిరళంగా గురియించేరు ! అవిరళంగా గురియించేరు ! కురియించేరు !

....

ముష్టి ముండా ?

ఆ గుడియొక్క యుత్తరంవైపు ద్వారమే యెప్పుడూ తెఱచి యుండి భక్తులకు దారి జూపిస్తూవుంటుంది. పడమటివైపు ద్వారం సంవత్సరంలో మున్నూట అరవయ్యేదు రోజులూ

మూసివుంటుంది. కాని ఉత్తరంవైపు ద్వారాని కిటూ అటూ వీధిలోని కరుగులు వున్నట్టే పడమటివైపు ద్వారానికికూడా అరుగులు వున్నాయి. ఉత్తరంవైపు ద్వారమ్మీద మహాఋషుల విగ్రహాలు వున్నట్టే పడమటివైపు ద్వారమ్మీదకూడా మహాఋషుల విగ్రహాలు బాసింపట్టుగా కూర్చోపెట్టినవి తేజరిల్లుతూ వున్నాయి. అవి ధ్రువతార వెలుగులోనైతే ఇవి సూర్యాస్తమయపు కెంపుందనంలో—ఎలా చూచినా గుడికిటువైపూ అటువైపూ అనే తేడా గుడియొక్క కట్టడంలో వున్నట్టు తోచదు కాని గుడియొక్క తలుపులు పూజార్లు తెఱవడంలో వున్నట్టు అగుపిస్తుంది.

ఈ పూజార్లు గావించినదానికి ప్రభుత్వంవారు కూడా తోడైనట్టు, ఉత్తరంవైపు ద్వారాని కెదురుగా రాజమార్గం బాహాటమైంది పఱిపించేరు. పడమటివైపుద్వారాని కడ్డంగా పోతగట్టు పోసి గోదావరినదేకాకుండా నదిమీదనుండి వచ్చేగాలి కూడా ఆ ద్వారంగుండా పోకుండా చేసేశారు.

మఱిన్నీ ఆ పోతగట్టు మూలంగా ఊళ్లో కుళ్లు నీళ్లు నదిలోకి నిరాఘాటంగా పోవడంమాని గట్టుకు లోబడి గుడిమీదుగా వైతరిణీ చాయను నల్లగా నిరంతరం పాఱుతూ వుంటాయి. ఉత్తరంవైపు రాజమార్గం గొప్పది వుండడంచేత అది సిగపువ్వుల ఘుమఘుమాయింపులతో మురిసిపోతూ వుంటుంది.

ఒకనాడు తూర్పునుంచి అలా రాజమార్గాన్నే గట్టెక్కి ఇలా దక్షిణంగా గుడికి ప్రదక్షిణ చేసేటట్టు మళ్ళి నడుస్తూ వున్నాను.—గుడియొక్క పడమటిదెస ఓ అరుగుమీద, కుళ్లు కాలవపక్కను, ఓ పాతగుడ్డల ముళ్ళయుయ్యాల్లో కేరుకేరుమని

ఏడుస్తూవుండే పసికందుయొక్క కాలుసేతుల అల్లల్లాడింపు కన వచ్చింది. వేళ అది సాయంత్రం. కాలం శీతాకాలం. వెలుగు చూపించేది సంజ మొగులు. బిడ్డదగ్గఱ ఎవ్వరూ లేరు.

"ఈ బిడ్డ ఈ గుడి అరుగుమీదనేనా పుట్టింది? ఎవరికి పుట్టింది?" అనే సమస్యలు వింతగా నా హృదయాన్ని తట్టి నాయి. ఆ తట్టడాని క్కారణం విశేషమైన సానుతాపము కాదను కుంటాను. "ఎవరికి పుట్టిన బిడ్డవురా వెక్కువెక్కుమని ఏడు స్తావు?" అనే సామెతలాంటి దెదో భాషాస్రవంతిలో దొరలుకు వచ్చి నా చెవులకు సోకినట్టయింది ఆ బిడ్డ ఏడుపువిన్నంతనే— దాన్ని పుచ్చుకుని అనుకుంటాను.

ఆ బిడ్డ ఆ గుడి అరుగుమీదనేనా పుట్టింది? ఎవరికి పుట్టింది? అక్కడెవళ్ళూ లేరు పరులు కాని గోడల్ని చింకి గుడ్డలు, చింకిచాపలు ఇత్యాదులు బిచ్చగాండ్రయొక్క మచ్చు సామాగ్రిలని అనుకొనేలాగు కనపడుతున్నాయి. బహుశః ఉత్తరద్వారం ముందు ముష్టి అడుక్కునే బిచ్చగాండ్రుయొక్క బసలుకాబోలు ఈ పడమటెంపు అరుగులు అని లోలోసమర్థించు కొని మఱిరెండడుగులు ముందుకు వేసినాను. బిడ్డయింకా గట్టిగా గట్టిగా గుక్కపట్టినట్టు ఏడుస్తూవుంది. వెనక్కితిరిగి చూచినాను.

ఒకానొక స్త్రీవ్యక్తి పఱుగెత్తుకొని ఆ పల్లపు బాటనే అరుగులవంచ కూడియున్న పెంటకుప్పలను తన తడబాటు కాళ్ళతో తన్నుకుంటూ, "నాబాబు! నాతండ్రి! ఏడుస్తున్నావురా? ఎంతసేపట్నుంచిరా? నాకన్ను! నాపండు!" అని అనుకుంటూ, అరుగులెక్కింది. ఆ బిడ్డని అలా ఉయ్యాల్లోంచి పైకి తీసింది. తాను కూర్చుని కాళ్లు కొంచెము సాచుకొని ఆ వంపునే ఏర్పడ్డు

అద్దాల్లో బిడ్డను పెట్టుకుని అతిస్నిగ్ధంగా పాలిస్తూవుంది. బిడ్డ వూరుకుంది.

ఆ నిశ్శబ్దంలో బిడ్డ పాలు కుడుచుకునే శబ్దం తక్క మఱోశబ్దం లేదు. శబ్దంలేకపోయినా అర్థంవుంది.

ప్రశ్న : నన్నెందుకు కన్నావు ?

జవాబు : నీవు పుడతావని అనుకోలేదు.

ప్రశ్న : అయితే నేను చనిపోనా ?

జవాబు : అమ్మయ్యో ! నీవు చనిపోవడమే ! నీవు చనిపోతే నేను చచ్చిపోనూ ? బ్రతికివుండగలనా ? నా చంద మామ చెండూ ! నా చుక్కల చూపూ !

అవకాశం అంతా ప్రశ్న జవాబు ప్రశ్న జవాబులతో ప్రతిధ్వనించిపోయినట్లయింది. ప్రతిధ్వనించిపోవడమే కాకుండా ప్రతిధ్వనితోపాటు జలదరించిపోయినట్లయింది. చీఁకటి తనంతనే కమ్ముకుపోయి దృశ్యాన్ని బాహిర్లోకానికి తిరోహితం చేసింది.

గుబాలున ఎప్పుడూ తెరువబడని పడమటి ద్వారం తెఱవ బడింది. పూజారి కాగడా వేసికొని అరుగుమీదకు వచ్చి "ఈ అరుగుమీదనే నీళ్ళాడావుటే ? ఈగుడి అరుగుమీద ? ఎప్పుడే ముష్టిముండా !" అన్నాడు. "ఇక్కడున్నవాళ్లు అంతా ముష్టివాళ్ళే. నన్నేమే అనక్కర్లేదు" అంది అది, ఆ కాగడా వెలుగున తన చింకిగుడ్డలను పిల్లాడికి పక్కగా పరుస్తూ— "గుడ్డలు గూడా పరుస్తున్నావు ? ఇంకా ఇక్కడ పడుకుందా మనే ! ఓసిరండా ! ఓసితొత్తూ ! గుడినంతనూ ధ్వంసంచేసి పార వేసినావే యీరోజున" అన్నాడు పూజారి. "ఈ రోజున కాదండీ నేను నీళ్ళాడింది. రెన్నాళ్ళయిందండీ !" అంది స్త్రీ నవ్వుతూ

ఆ పఱచిన గుడ్డలమీద బిడ్డను పవళింపజేస్తూ. "ధర్మకర్తతో చెప్పి నిన్నీడిపిస్తాను" అన్నాడు పూజారి. "అంత మాత్రం గడువి స్తే నాబిడ్డ మహారాజై నిన్నీగుడిలోనుంచి గెంటింపిస్తాడు" అని మెహర్బాణీగా అనుకొని రాణీలాగు పిల్లపక్కలో పడు కొంది బిడ్డమీద అభయహస్తం వేసుకోని.

పూజారి వెళ్ళిపోయినాడు. కాగడా గుడిలోకి మళ్ళి పోయింది. గుడితలుపులు డబడబ మళ్ళా గెడలు పడిపోయినయి.

ఆ అమ్మి ఆలోచిస్తూవుంది ప్రణయపరమైన ఒకానొక మహాగాథ ఆమెకు స్ఫురిస్తోంది. ఆ స్ఫురణలో విఘడియలు, ఘడియలు, జాములు గడవగా రాత్రి రెండవయామమైంది.

రెండవయామానికి గుడియొక్క పడమటివైపు మురుగు నీటిలో ప్రతిఫలిస్తూ క్రమంగా ఆమె మీదకొకక పెట్రోమాక్సు లైటు వెలుతురు పడింది. ఆమె చూడలేదు. వెలుతురులో ధర్మ కర్తా పూజారీ యిద్దఱూ వుండి ధర్మకర్త అడుగుతున్నాడు "ఇదేనా ఆ మనిషి ?" అని, పూజారి "అవు" నంటూ యున్నాడు. ఆమె వారి సంభాషణవినలేదు.

ఆమె అనుకుంటోంది తనలో—"వాని శరీరం మీద ఆ సమయాన్ని గుడ్డలువున్నా గుడ్డలు లేనట్టే. వాని యొడలు చలిచేతను కంపించి పోవుచున్నది. వాడు దిక్కులేక నాకడకు వచ్చేనన్నాడు. ఎవడవని అనకుండానే వానియొక్క మణికట్టు పట్టుకుని వానిని ఈ అరుగు ఎక్కించాను. వాడు నాచేయి తాకుడుకు పరవశుడయిపోయి నీ యొళ్లెంతో వెచ్చగా నున్న దన్నాడు. ఎంతో హాయిగా నున్నదన్నాడు. నా నెత్తుటియొక్క గుణము కనిపెట్టినవా డీలోకంలో నొకడున్నా డనుకున్నాను.

వానికి నాహృదయం ఇచ్చి ఇచ్చి ఈ అరుగుమీద — ఈ అడుగు మీద — అప్పు డీతలుపులేమైపోయినవి. అప్పుడీ కాగడాలేమై పోయినవి. అప్పుడీ పూజార్లేమైనారు ? ”

ధర్మకర్త ఆమె స్వగతం వింటూ పూజారితో “ ఈ తలుపు లెప్పుడూ తెఱచియుంచవలసినది. ఎప్పుడూ తెఱచియుంచినయెడల యిలాంటి ముష్టిముండ లిలా నక్కియుండడాని కవకాశముండదు చూడూ ! ” అన్నాడు.

నిదరలోంచి మేల్కాంచినట్లు ఆమె లేచింది. లేచి ధర్మకర్తతో “ బాబూ ! ఈ నాశరీరం ముష్టియెత్తితే నాకువచ్చింది కాదు. ఈ నాబిడ్డడు నాకు ముష్టియెత్తితే వచ్చినవాడు కాడు. ఎందుకు పదిసార్లు ముష్టిముండా ముష్టిముండా అని అంటారు. నన్ను ప్రేమచే సంపాదించుకొంటినని నాతల్లి మురిసిపోయింది. నేనున్నూ నాబిడ్డను యీబిడ్డను ప్రేమచేతనే సంపాదించుకోగల్గితినని మురిసిపోవుచున్నాను ” అంది. ధర్మకర్త దానివైపునకు తేరిపార చూచినాడు. వసంతఋతువులో పువ్వుపూసిన మల్లెతీగలా నవ్వింది ఆమె.

“ ఏడీ నీ ప్రియుడు ?” అన్నాడు ధర్మకర్త. “ ఇవిగో యీపాత చింకిగుడ్డలను ఇక్కడ దిగవిడిచి ఆ తెల్లవాఱుజామున నే వెళ్ళిపోయినాడు. వీనినిబట్టి మీరు వానిని ఆనవాలుబట్టి నాకు తిరిగి ప్రసాదించినట్లయినా వేవేల దండాలు ” అంది. ఆ గుడ్డలకేసి ధర్మకర్త పరీక్షించి చూచినాడు. ఒక్కదానిమీదను పేరు లేదు. ఒకదాని పోలినగుడ్డ మఱొకగుడ్డ కాదు. అన్నీ పేలికలే. ఒకదాని కింకొకముక్క చొప్పున వాని నన్నింటినీ అతికినా బొంత కాదు.

ఆమెను చూచి ధర్మకర్త మిక్కిలి జాలిపొందినవాడై పూజారితో "ఈ పడమటివైపు తలుపులు ఎప్పుడూ తెరవక పోవడమే మేలు. నేటినుంచీ ఈవలివైపు తాళంవేసి వేయు చున్నాను. ఈ వైపునకు మీ రెవ్వరును రావద్దు" అని శాసించి నాడు. శాసించి తాళంవేసి పూజారితో పెట్రోమాక్సులైటుతో ధర్మకర్త వెళ్ళిపోయినాడు.

ఆ పురటాలిప్రాణం కుదుటుపడింది. బిడ్డను మెల్లిగా తన పొత్తిలోని కిముడ్చుకొని కాళ్ళు దగ్గఱగా తీసికొని గాఢ నిదరలో నిర్యాణావస్థ ననుభవిస్తోందా అన్నట్టు విలసిల్లి పోయింది.

....

టర్కీలు - గినీలు

టర్కీలు, గినీలు, అంటే అవో రెండు రకాల కోళ్ళు. కథ కాపేరిచ్చి నందు క్కారణం మఱేం లేదు. ఆ కోళ్లు ఆ "కాలెనీ" లో పెంచ బడతాయి. "కాలెనీ" అంటే పెద్దవలస రాజ్యం అనుకొనేరు కనుక. రైల్వే కాలెనీ. రైల్వే కాలెనీ అని వీథుల్లో రైళ్లునడవ్వు. రైల్వే యిలాకా నవుకరీవుండే ఏంగ్లో ఇండియన్లు విస్తారంగా కాపురం ఉంటారు. అందుచే దాన్ని రైల్వే కాలనీ అని పిలవడం పరిపాటి. కానైతే, రైళ్లు పక్కనుంచి కూస్తూపోతాయి. పూర్తిగా రైళ్ళకూ ఆ కాలనీకి సంబంధం లేదని అనడానికి వీల్లేదు. సంబంధం ఉండనూ ఉంది లేనూలేదు.